# పెట్టే చీర



మల్లాది వెంకట కృష్ణమూర్తి

**కల్పకం ఒక్కతే చెల్లెలు నరహరికి**

ప్రతిఏడు దీపావళి పండగకి పిలిచి, కల్పకానికి ఒక చీర, జాకెట్టు, పండు, తాంబూలం పెట్టడం నరహరికి గత అయిదేళ్ళగా ఆనవాయితీగా వస్తోంది.

కల్పకం, నరహరుల తండ్రి పోయి అయిదేళ్ళ యింది. తన తండ్రి స్వర్గస్తుడైనప్పటినుంచీ, ఆయన బాధ్యత తనమీద వేసుకుని, తనకు శక్తి వున్నంతలో చీర, జాకెట్టు పెడుతున్నాడు నరహరి చెల్లెలికి.

ఆడపిల్ల కాబట్టే, అన్నయ్యనుంచి ఖరీదైన చీర ఆశించడంలో కల్పకం తప్పులేదు. నరహరి పెద్ద వుద్యోగస్తుడు. చన్నీళ్లకు వేణ్ణీళ్ళ తోడన్నట్లుగా, నరహరి భార్య కూడా ఉద్యోగంచేసి నాలుగొందలుదాకా సంపాదిస్తోంది.

సంపాయించటంలోని కష్టం తెలుసు కల్పకం వదినకి. స్వతహాగా కొద్దిగా పిసినారికూడా. ఏటేటా తన భర్త కల్పకానికి ఖరీదైన చీరెలు పెట్టడం ఆవిడకి - నచ్చలేదు. నోటితో లేదనేబదులు, చేతోనే లేదు అంటే మంచిదనే అభిప్రాయంతో, భర్త యిష్టాన్ని తిరస్కరించడానికి మనస్కరించక, యీసారి తనే కల్పకానికి పెట్టే చీర చవకలో కొనుక్కొచ్చింది.

ప్రతీ ఏడు పెట్టే చీర ఖరీదులో నాలుగో వంతు ఖరీదుచేసే, మామూలుగా ఇంట్లో వాడుకునే కట్టుబడిచీర కొనితెచ్చింది. ఆ వాయిల్‌చీర ఖరీదు నలభైరెండు రూపాయల తొంభై అయిదు పైసలు. ఆ తోపురంగు చీరకి జత అయ్యే జాకెట్టుముక్క గూడా అయిదు రూపాయలకి కొన్నది.

ఎప్పటిలాగే చెల్లెలిని, బావని పండగకి పిలిచాడు నరహరి ఆమె తన ఇంటికి వెళ్లబోయే ముందు బొట్టుపెట్టి, ఆ వాయిల్‌చీర, జాకెట్ పెట్టారు. వాటిని చూడగానే కల్పకం మొహంలో పొడసూపిన రోషం, అసంతృప్తి గమనించి చెప్పింది నరహరి భార్య ఆడబిడ్డకి.

"ఏం అనుకోకు కల్పకం ! యీసారి ఆట్టే మంచి చీర పెట్టే స్థితిలో లేము. మొన్న కాన్పుకి, డాక్టర్ బిల్‌కి నాలుగ్గైదు వందలదాకా అయింది... ఇంట్లో కట్టుకోడానికి నీకు నాలుగే చీరలున్నాయి అందులో. అయిదారుంటేసే మన్నుతాయి. వచ్చే దీపావళికి మంచి చీర పెడతాంలే అమ్మా !"

కల్పకం సమాధానం యివ్వలేదు. మౌనంగా వుండిపోయింది.

"పోన్లే వదినా !' అనే జవాబుకోసం ఎదురు చూసిన నరహరి భార్య హతాశయురాలైంది.

"దీనికెంత టెక్కో వూరికే వచ్చేదానికి కూడా !" అనుకుంది మనసులో.

వాళ్ళ ఇంటి గడప దాటి, వందగజాల దూరం వెళ్లాక అన్నది కల్పకం కోపంగా భర్తతో.

"ఈ చీర ఛస్తే కట్టనీ జన్మలో !"

ఆ చీరని యెలా వదిలించుకోవాలో కల్పకం అక్కడికక్కడే నిర్ణయించుకుంది. వెంటనే దానిని అమలుజరిపింది.

*   *   *

"నలభైరెండు రూపాయల తొంభై అయిదు పైసలు అమ్మగారూ ! ధర కాగితం చీరకే అంటించివుంది చూసుకోండి."

"మూడుదఫాలుగా ఇచ్చే పద్ధతిలో ఇస్తాను." అన్నది పని మనిషి.

"నాకు ఇంట్లో కట్టుకోడానికి బొత్తిగా చీరలే లేవు. ఇన్‌స్టాల్‌మెంట్‌లో మంచి చీరలేమైనా వుంటే చూపించు" అని నాలుగు దినాల క్రితం అడిగితే పనిమనిషి ఆ చీరను చూపించింది ఆవిడకి.

తోపురంగు వాయిల్ చీర. ఆవిడకి నచ్చిందా చీర. మొదటి దఫా డబ్బు చెల్లించి ఆ చీరను కొనుక్కుని అడిగింది ఆవిడ— అంటే నరహరి భార్య.

"ఎక్కడిదే ఈ చీర?"

పనిమనిషి సమాధానం చెప్పింది

"మాలాలీలో మా చెల్లెలు ఓ ఇంట్లో పని చేస్తోంది. ఆ ఇంటావిడ మా చెల్లెలికి పెట్టిందీ చీర ప్రతీఏడు దీపావళి పండుగకి పాతిక రూపాయల చీర కొనిస్తుందిలెండి మా చెల్లెలు యింత ఖరీదు చీరలు కట్టదు కాబట్టి నాకు నలభైకి అమ్మింది."

"మాలాలీలోనా? ఎవరే ఆవిడ? కొంపతీసి కల్పకం కాదుగదా?" అనుమానంగా, అసహనంగా అడిగింది నరహరి భార్య.

"కల్పకం అమ్మగారు మీకెలా తెలుసండీ?" విస్మయంగా అడిగింది పనిమనిషి, నరహరిభార్యని.

త్వరలో
కొత్త సీరియల్ !
కాలమిచ్చిన
తీర్పు